


పులిపాక శ్రీరామచంద్రమూర్తి

**సాయంత్రం** అయిదున్నర, ఆదివారం.

ఆ గదిలో ఒంటరిగా కూర్చుని ఏదో నవల తిరగేస్తున్నాడు కేశవరావు. అతని రూమ్‌మేట్స్ ఇద్దరూ బయటికి వెళ్ళారు.

నవల చదివీ చదివీ అతనికి విసుగ్గా ఉంది. దాన్నక్కడ పారేసి సిగరెట్టు ముట్టించి కిటికీ దగ్గర నిలబడ్డాడు కేశవరావు. 'సినిమా కెళదాం' అని చెప్పిన రమేష్గానీ, రఘురామ్ ఇంకా రాలేదు.

అతను గదిలో అసహనంగా తిరిగాడు.

వాళ్ళిద్దరూ ఇప్పుడేం చేస్తుంటారు? రెండు క్షణాలు ఆలోచించాడు కేశవరావు. ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడం చాలా కష్టం. ఏ హోటల్లోనో కాఫీతాగుతుండొచ్చు. కిళ్ళీ కొట్టు సత్యన్నారాయణతో కబుర్లాడుతుండొచ్చు. 'దారిన పోయే ఫలానా పిల్ల ఫలానా ఇంట్లో ఉంటుందా ఉండదా?'' అనే విషయం చర్చిస్తుండొచ్చు. 'ఫలానా రాజకీయ పార్టీ ఎందుకు గొప్పది కాదో?' వాదిస్తూ కూర్చోవచ్చు.

అవేవీ కాకపోతే

ఆ రోజు సినిమా హాల్లో అయిన తగాదా గురించో, పూలవనం మామిడి తోటలో ఎలా మందు కొట్టారో చెప్పుకుంటూ ఉంటారు.

ఇవీ కాకపోతే

మొన్న తామిద్దరూ టీజ్ చేసిన పిల్లని ఎవరి అకౌంట్లో వేసుకోవాలని మాత్రం కవిత్వంగా ఆలోచిస్తుంటారు.

సమాధానాలు ఇన్ని ఉండటం వల్ల కేశవరావు ప్రశ్నను వాయిదా వేశాడు.

సరిగ్గా అప్పుడే కిటికీ లోంచి దూరంగా హుషారుగా వస్తున్న జనార్దన్‌రెడ్డి కనిపించాడు బ్రీఫ్ కేసుతో. కేశవరావు మొహం వెలిగింది ఒక్కసారి. అతను జనార్దన్‌ని చూసి చాలా రోజులైంది.

వాళ్ళు నలుగురూ అదే రూములో ఉంటూ, అక్కడే కాలేజీ చదువు పూర్తి చేశారు. జనార్దన్ రెడ్డికి ఉద్యోగం చేయాల్సిన అవసరమేమీ లేదు. అలాగని చదువుమీదకూడా అంత ఆసక్తి లేదు. ఒక రకమైన నిరాసక్త దశలో ఉంటున్నాడు తన పల్లెటూళ్ళో.

జనార్దన్ తండ్రి చదువు కోకపోయినా ఇరవై ఎకరాల భూమిని నలభై కి పెంచ గలిగాడు. రైసు మిల్లులో షేరుహోల్డ రయ్యాడు. సినిమాహాలు కట్టించే ప్లానులో ఉన్నాడు.

జనార్దన్‌కి డబ్బున్న వాడికొడుగ్గా సుపీరియారిటీ ఫీలింగ్ లేదు. ప్రెస్టేజి జనిస్తూ కూర్చోడు అందువల్లనే అతనంటే మిగతా ముగ్గురికీ చాలా అభిమానం.

కేశవరావు ప్రస్తుతానికి నిరుద్యోగి. రఘురామ్ బాంకు క్లర్కు కాగలిగాడు. రమేష్ ఒక ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా ఉంటున్నాడు.

రూమ్‌లోకి రాగానే జనార్దన్ కేశవరావుని చుట్టేశాడు ఒక్కసారి. తరవాత తీరిగ్గా గడ్డం చేసుకోవడంలో మునిగిపోయాడు.

''ఏమిటి విశేషాలు?'' అడిగాడు కేశవరావు. అంత సీరియస్‌గా గడ్డం చేసుకోవాల్సిన అవసరం ఏముందో అతని కర్థం కాలేదు.

''చెబుతా. తొందర పడకు! ఈ వెధవ లిద్దరూ ఎక్కడి కెళ్ళారు?''

''ఆ విషయం వాళ్ళొస్తే కాని తెలీదు.''

బకెట్ నిండా నీళ్ళతో బాత్‌రూమ్‌కి వెళ్ళి పోయాడు జనార్దన్. పల్లెలో పల్లెమనిషిలా, టవున్లో టవును మనిషిగా ఉండాలనేది అతని నినాదం. స్నానం చేసొచ్చి, బ్రీఫ్‌కేస్ తెరిచి సఫారీ డ్రస్ బయట పడేశాడు.

పదునిమిషాల్లో తయారై చెయిర్లో కూర్చున్నాడు. కేశవరావు సస్పెన్స్ ఫిల్మ్ చూస్తున్నట్లు నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

''హాయ్''. వినిపించింది రూమ్ ముందు.

''హలో.''కూడా వినిపించింది.

తరవాత రఘురామ్, రమేష్ వచ్చారు గదిలోకి. జనార్దన్‌ని పట్టుకుని ఉక్కిరి బిక్కిరి చేసేశారు.

దిండు గోడ వారకి లాక్కుని దాని మీద చాలా సుఖంగా కూర్చున్నాడు రఘురామ్. రమేష్ గడప మీద కూర్చున్నాడు.

ఆ నలుగురూ బ్రహ్మచారులే. అందుకే అన్ని విషయాల్లో 'ఓకిట్ ఈజీ' పద్ధతి కనిపిస్తుంది.

దానికి గుర్తుగా.

ఆ గదిలో పారేసిన టూత్ బ్రష్‌లు, మూత ఎక్కడుందో తెలీని క్లినిక్ షాంపూ, సొట్టలు పడ్డ షేవింగ్ డబ్బీ, చెల్లా చెదరైన రేజరు సెట్లూ, హేంగర్స్‌కి తగిలించని బట్టలు, సినిమా పత్రికలు బాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్స్ కోసం అచ్చేసిన గైడ్సు రెండు, విచిత్రమైన మోతతో తిరిగే టేబుల్ ఫాను, పన్నెండు జతల చెప్పులూ ఉన్నాయా గదిలో.

''పల్లెటూరు బోరు కొట్టి పట్నం గాలి కోసం వచ్చావా?'' అన్నాడు రఘురామ్.

''గురో! మాంచి ఇంగ్లీషు సినిమా వచ్చింది. సెక్సు సముద్రం. కొట్టేద్దామా?'' అన్నాడు రమేష్.

జనార్దన్ నవ్వుతూ చూశాడు కాని, ఏమీ మాట్లాడలేదు.

''ఎప్పుడూ సినిమాల గొడవే. పెందరాళే భోజనం చేసి పైన డాబా మీద పడుకుంటే చక్కటి నిద్ర. అన్నాడు కేశవరావు.

''వెధవ మాటలతో నన్ను హింసపెట్టకు'' అన్నాడు రఘురామ్ కేశవరావుతో.

తరవాత జనార్దన్ వైపు చూస్తూ—

''సినిమాకి వెళ్ళకపోతే బార్ కెళదాం'' అన్నాడు.

రమేష్ మొహం వికసించింది. కేశవరావు తలూపాడు. జనార్దన్ లేచి నిలబడ్డాడు.

గదికి తాళం వేసి బయలుదేరారు నలుగురూ.

కేశవరావు మళ్ళీ అడిగాడు.

''ఎందు కొచ్చావో ఇంతవరకు చెప్పలేదు నువ్వు.''

''తొంద రెందుకు? బార్లో చెబుతాను £

షేకింగ్ మ్యాన్'' అన్నాడు జనార్దన్.

''గురో! మనకేసొస్తూంది'' అరిచాడు రఘురామ్. మిగతా ముగ్గురూ అటు వేపు చూశారు. దూరంగా ఎర్ర చీర పిల్ల వచ్చి వచ్చి పక్క వీధిలోకి మాయమైంది.

రఘురామ్ జనార్దన్ పక్కనే నడుస్తూ ఎర్ర చీర ఎవరో, తనకీ ఆ పిల్లకీ సంబంధం ఏమిటో, ఎన్ని సార్లు ఎలా కలుసుకున్నారో, వాళ్ళ నాన్నకి ఎందరు రౌడీలు తెలుసో ఆ వివరాలన్నీ బోధ పరుస్తున్నాడు.

ఆ గొడవ ఇప్పుడప్పుడే తేలే విషయం కాదని కేశవరావు, రమేషూ వెనక పడ్డారు కావాలనే.

బార్ కెళ్ళారు. కౌంటర్లో ఉన్న తను రఘురామ్‌ని చూసి మందహాసం చేశాడు.

నలుగురూ వెళ్ళి కూర్చున్నారు చిన్న రూమ్‌లో. గోడ మీద అడవి సీనరీని ఒక్క క్షణం చూసి, పక్కనే ఉన్న సాకీ, ఉమర్ ఖయ్యాంల పెద్ద చిత్రాన్ని చూడ్డంలో మునిగి పోయాడు రమేష్.

ఎర్ర చీర గురించి ఇంకా చెబుతూనే ఉన్నాడు రఘురామ్. బోయ్ విస్కీ బాటిలూ, గ్లాసులూ పెట్టి వెళ్ళాడు.

ఐదు నిమిషాలు నలుగురూ నిశ్శబ్దంగా ఉన్నారు.

''ఈ నెల ఇరవై ఆరో తేదీన నా పెళ్ళి. మీ రందరూ వచ్చి వధూవరుల్ని ఆశీర్వదించి మరీ, మరీ...''

''ఇక ఆపు. నీ పెళ్ళని చెప్పావు కదా'' అన్నాడు రఘురామ్ విసుగ్గా. కేశవరావూ, రమేషూ ఆశ్చర్యంగా జనార్దన్‌ని చూస్తూ ఉండిపోయారు.

రఘురామ్ పోజు మార్చేశాడు.

''పాపం ఆ దురదృష్టవంతు రాలెవరో? ఐ పిటీ హెర్.'' అన్నాడు విషాదంగా.

నవ్వులు మారుమోగా యా గదిలో.

''త్రీచీర్స్ ఫర్ ది హాపీ మేరీడ్ లైఫ్ ఆఫ్ మిస్టర్ జనార్దన్'' అన్నాడు రమేష్. కేశవరావు నవ్వుతూ చూస్తున్నాడు.

''పెళ్ళి చేసుకుంటున్నా వన్నమాట. ఇక ముందు గలవా? లేవు. హాయిగా తిరగ్గలవా? లేవు. ఆడపిల్లల గురించి మనసులో తప్ప ఆలోచించుకోగలవా? లేవు! ఐ పిటీ యూ! ఇన్నింటిని వదిలేసి పెళ్ళి చేసుకుంటానంటే చేసుకో. కాని నేను మాత్రం జాలి పడుతున్నాను'' అన్నాడు రఘురామ్ చాలా విచారంగా.


''పెళ్ళి చేసుకోకుండా ఎంత కాలం ఉంటాడేమిటి'' వెనకేసు కొచ్చాడు కేశవరావు.

''ఐతే, వీడు బాల్య వివాహాన్ని సమర్థిస్తూ ఎస్సే రాసినా రాసేయగల్డు. వాటిని విశ్లేషించినందుకు బాధ పడుతున్నట్టుంది. లేకపోతే అప్పుడే 'పెళ్ళే' మిత్రా అంటే వెనకేసు కొస్తున్నాడు వెధవ'' అన్నాడు రమేష్ నవ్వుతూ.

''నువ్వేం ఎద్దేనా చెయ్య నక్కర లేదు'' అన్నాడు కేశవరావు నవ్వుతూ.

''పెళ్ళి రోజున మందు పార్టీ ఉందా?'' అడిగాడు రఘురామ్ ఆతుర్దాగా.

''అలాంటివి పెట్టుకోకు గురూ! ఆ రోజునే విడాకులికి అప్లై చేస్తుంది వచ్చే ఆవిడ'' అన్నాడు కేశవరావు.



జనార్దన్ నవ్వుతూ వింటున్నాడు ఏమి కామెంట్ చెయ్యకుండా. గ్లాసుల్లో ద్రవం తరుగుతూంది. బుర్ర తిరుగుతూంది.

''అమ్మాయిదే వూరు!'' అడిగాడు కేశవరావు.

''మా వూరే.''

''అంటే మీ వూళ్ళోనా పెళ్ళి. చచ్చాంపో. ఇక్కడ ఆర్య వైశ్య కల్యాణమంటపంలో చేసుకోక అక్కడేం పెళ్ళిరా? ఫ్రెండ్స్ చాలా మంది వస్తారు. హుషారుగా, జాలీగా ఉంటుంది. ఇప్పుడు మీ వూరు రావాలంటే రెండు బస్సులు మారాలి. మూడు మైళ్ళు నడవాలి. మేం రాలేం కాని, పెళ్ళి అయ్యాక మీ ఇద్దరే ఇక్కడి కొచ్చేయండి. మన త్రీ స్టార్ హోటల్లో ఉండొచ్చు నాల్రోజులు'' అన్నాడు రఘురాం.

''మీరు నా పెళ్ళికి రాకపోతే మాట రెండుకు! తరువాత తెలుస్తుంది'' అన్నాడు జనార్దన్.

''మూడు మైళ్ళు నడులేం గురూ! ఆ డొంకల్లో ముళ్ళల్లో పడి మేం రాలేం'' అన్నాడు కేశవరావు.

''మీరు నడిచే దేం ఉండదు. బస్సు దగ్గరికి మా ట్రాక్టరు పంపిస్తాం. అందులో వచ్చేయండి.''

''ట్రాక్టరైతే అసలు రానేరాం'' అన్నాడు రమేష్. బోయ్‌ని కేకేసి ఇంకో క్వార్టర్ తెమ్మని

''మీరు ముగ్గురు ఇంకోసారి మాట్లాడితే ఈ బాటిల్ తో ఇక్కడే హత్య చేసేస్తాను. మీరు నా


పెళ్ళికి వస్తున్నారు. అంతే!'' గంట కొట్టినట్టు చెప్పాడు జనార్దన్.

బోయ్‌కి డబ్బిచ్చి బయట పడ్డారు నలుగురూ. రూము కెళ్ళాక బట్టలు మార్చుకుని పక్కలు పట్టుకుని డాబా మీది కెళ్ళారు. కేశవరావుకీ, రమేష్‌కీ భయంగా ఉంది, మళ్ళీ ఎర్ర చీర గురించి రఘురాం చెబుతాడేమోనని. కాని అత నావిషయం మాట్లాడ లేదు. రాజకీయాల మీద మాట్లాడాడు.

ఉదయాన్నే వెళ్ళిపోయాడు జనార్దన్, పెళ్ళికి రాకపోతే ఏవేం అనర్థాలు జరుగుతాయో చాలాసేపు చెప్పాక.

పెళ్ళి రోజు దగ్గర కొచ్చింది. ఆ రోజు ఉదయం పది గంటలకే ముగ్గురూ ఎంత వీలైతే అంత తక్కువ లగేజీతో బయలుదేరారు బస్ స్టేషన్‌కి.

జనార్దన్ వాళ్ళ వూరికి మూడు మైళ్ళ దూరంగా వెళ్ళే పాసెంజర్ బస్సొకటి ఉంది. ఆ బస్సు వస్తుందని చెప్పింది ఎంక్వైరీ.




ఆవిడ పేర పాసింజర్ బస్సు లాగానే ఉంది.

కానీ ఆ బస్సు ఎంత సేపటికీ రాలేదు. ముగ్గురూ మళ్ళీ వెళ్ళి అడిగారు. తను టైమింగ్స్ మాత్రమే చెప్పగలననీ, బస్సు రావటం రాకపోవడంలో తనకు ఎటువంటి సంబంధం లేనేలేదనీ, బస్సు చెడిపోతే చెడిపోయి ఉండవచ్చనీ, ఈ మధ్య కార్మికులకి మెరుపు సమ్మె ఫాషనై పోయిందనీ. ఇలా చాలా సేపు చెప్పిం దావిడ.

బస్సు రాకపోయినా ఆవిణ్ణి మాత్రం అడక్కూడ దని నిర్ణయించుకున్నాక బస్సు వచ్చింది. కానీ అది వచ్చినందుకు వాళ్ళ కేమీ సంతోషం మిగల్లేదు. లోపల సీట్ల లోంచే జనం పుట్టుకొచ్చినట్లు కన బడ్డారు. తట్టలూ, బుట్టలూ, పెట్టెలూ, బ్రీఫ్ కేసులూ, బాడీలు, మూటలూ, కేకలూ, జాగ్రత్తలూ మనుషుల మీంచి వెళ్ళాయి. తరవాత జనం వెళ్ళారు.

కేశవరావు కళ్ళ ముందు ఛెంగిస్‌ఖాన్లూ అలె గ్జాండర్లూ కనిపించారు. ఎలాగైతేనేం బస్సెక్కారు. చెమటలో నాన్చి, నాన్చి బయలుదేరింది బస్సు.

ముగ్గురూ సంతోషించారు. కండక్టర్‌కి వాళ్ళ లా సంతోషించడం నచ్చ నట్లుంది—టవున్ దాటాక బస్సాపి టిక్కెట్లు ఇచ్చాడు. మరికి వారే తిట్టారు కండక్టర్ను. సహనం ఎందుకు గొప్పదో తెలిసిపోయింది కేశవరావుకి.

అలా నడిచి నడిచి బస్సు ఆగింది వాళ్ళు దిగాల్సిన వూళ్ళో కాదు, దిగి తీరవలసిన వూళ్ళో. దాదాపు అన్ని స్టేజీల్లోనూ ఒక్కొక్కరే దిగి ఏడుగురు చొప్పున ఎక్కారు. డ్రైవరు కాలానికీ, దూరానికీ అతీతుడుల్లే కనిపించాడు కేశవరావుకి. ఎంత ఐన్‌స్టైన్ సిద్ధాంతానికైనా జనమే మూలం.

బస్సు దిగాక రఘురాం ఆ బస్సునీ, ఆర్టీసీనీ కండక్టర్నీ, ప్రభుత్వాన్నీ, దేశాన్నీ, జనాన్నీ తిట్టాడు. తిట్టి ప్రయోజనం లేదని చుట్టూ చూశాడు.

ఒక మాదిరి వూరు. ఒక సినిమాహాలు, మూడు బార్లూ, పది ఫాన్సీ షాపుల వరకు అభివృద్ధి చెందింది. అక్కణ్ణించి మూడు మైళ్ళ వెళ్ళాలనే విషయం మహా బాధగా ఉంది వాళ్ళ ముగ్గురికీ. ఏ క్షణాన మరైనా వెనక్కి వెళ్ళిపోదాం అనేలా ఉన్నారు.

''ఇక్కణ్ణించి ఏదో ప్రైవేటు సర్వీసుండాలి. అప్పుడెప్పుడో జనార్దన్‌గాడు చెప్పాడు.'' అన్నాడు రఘురామ్.

''అది లేటు కనుకే ట్రాక్టర్ పంపిస్తానంది.

''ట్రాక్టర్‌లో వెళ్తే వళ్ళు హూనమైపోతుంది'' అన్నాడు రఘురామ్ చిరాగ్గా.

''అలాంటప్పుడు వెళ్ళకపోతేనేం? తర్వాత పది పేజీల అపాలజీ లెటర్ రాద్దాం'' అన్నాడు రమేష్.

''వెళ్ళడం మంచిది. లేకపోతే తొలిరాత్రి కూడా జనార్దన్ వరండాలో సిగరెట్లు కాలుస్తూ మనల్ని తిట్టుకుంటూ, ఆవిడని క్షోభ పెడతాడు. ఆ పాపం మన కెందుకు వెళ్దాం'' అన్నాడు కేశవరావు.

''మరి ట్రాక్టర్ ఏది?'' అన్నాడు రమేష్ అటూ ఇటూ చూస్తూ.

''దాని సంగతి తర్వాత చూసుకో వచ్చు. ముందు లక్ష్మీ వైన్స్ వ్యవహారం చూడండి.'' ఎదురుగా బ్రాందీ షాపుని చూపిస్తూ అన్నాడు రఘురామ్.

''నిజమే బ్రోయ్. ఎప్పుడో రాత్రికి కదా పెళ్ళి. ఏం తోచి చస్తాం ఇక్కడ? నో హాఫ్ పట్టుకెళితే మంచిది'' అన్నాడు రమేష్.

''పెళ్ళి కెళ్తున్నా తాగుడు గొడవే.'' మన కున్నాడు కేశవరావు.

''ఇలాంటి వేధులే తెగ తాగేది'' అన్నాడు రఘు రామ్ ముందుకి నడుస్తూ. మిగతా ఇద్దరూ అతన్ని అనుసరించారు.

ఆ షాపు కౌంటర్లోని వ్యక్తి తాగి తాగి అలా అయిపోయాడో, అదాయన ఒరిజినాలిటీయో తెలీదు కాని, సన్నగా తుఫాను వచ్చి వెళ్ళిన తరవాత మిగిలిన ఒకే ఒక ఆకులూ, కొమ్మలూ లేని చెట్టులా ఉన్నాడు. ఆయన కొంచెం నవ్వాడు హాఫ్ బాటిల్ ఇస్తూ.

బాగ్‌లో పెట్టి రోడ్డు మీద కొచ్చేసరికి ట్రాక్టర్ వస్తోంది ఎగిరెగిరి పడుతూ. ఆ ముగ్గురికీ గుండె బేజారెత్తిపోయింది. బాయ్‌నెట్ మీద తప్ప కూర్చోడానికి స్థలంలేదు. వెనక తొట్టె నిండా జనం... పెళ్ళిజనం ...

''ఎక్కండి వెళ్దాం'' అన్నా డొకాయన ఎదు రొస్తూ. జనార్దన్ బాబాయి నని ఆయన పరి చయం చేసుకున్నాడు.

''ఈ వూళ్ళో మా వాళ్ళు చాలా మంది ఉన్నారు. వాళ్ళని ఎక్కించుకొని వస్తున్నాను'' అన్నా డాయన సంజాయిషీగా. చెమట, ఇరుకూ, కుదుపుల్లో బాధ పడ్డం కంటే నడవడమే మంచి దనుకున్నాడు కేశవరావు.

రఘురామ్ అప్పటికే ఎక్కి కిందనించి ఓ నల్ల చీర మనిషి అందిస్తున్న పిల్లల్ని అందుకుంటున్నాడు. ట్రాక్టర్ వెళ్ళిపోతుందేమోనని ఆమె చాలా హడావుడిగా పడుతున్నట్టు తెలుస్తోంది. సహాయం చేస్తున్నందుకు ఆమె సంతోషించింది. ఆ సంతోషం తన పక్కనే కూర్చోపెట్టదా అని రఘురామ్ ఆలోచిస్తున్నాడు. కానీ నల్లచీర ఒక ముసలాయన పక్కన కూర్చుంది. మధ్యలో ఆయన, అటూ ఇటూ పిల్లల్నటూ. ముసలాయన గొడుగు ఒళ్ళో పెట్టుకూర్చున్నాడు. ఖచ్చితంగా అది ద్రోహబుద్ధే.

కేశవరావూ రమేషూ ఎక్కాక కదిలింది ట్రాక్టర్. డొంకలూ, రాళ్ళూ, ఇసుకా, ముళ్ళనీ దాటి సాగింది ప్రయాణం. వాళ్ళ ముగ్గురికీ జనార్దన్‌ని తందా మనిపిస్తోంది. ఏదో వూరు వచ్చింది. అదే అదే అనుకున్నారు. కాదని తేల్చేశారు జనం. రఘురామ్ రెండు సిగరెట్లు తగలేశాడు, ముసలాయన ముక్కు బిగించాడు.

ధూమపానమూ—నష్టాలు గురించి చెబుతాడేమో నని రఘురామ్ జడిసిపోయాడు ఆయన చూపుల్ని బట్టి. అంతలో జనార్దన్ వాళ్ళ వూరొచ్చింది.

అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలైంది. జనార్దన్ వీళ్ళని చూసి నవ్వుతూ దగ్గర కొచ్చాడు.

''ఎలా ఉంది ప్రయాణం?'' అడిగాడు జనార్దన్.

''పెళ్ళిని వూరుకుంటున్నాం. కానీ హత్యచేసే ఉద్దేశంలో ఉన్నాం. మావీ పల్లెటూళ్ళే కానీ మరీ

ఇంత తొందరైన ప్రయాణాలు కావు'' అన్నాడు రమేష్. జనార్థన్ నవ్వాడు.

''ఈ ప్రయాణం జన్మలో మర్చిపోలేం'' అన్నాడు కేశవరావు.

''అందుకే గదా రమ్మంది! పదండి. స్నానంచేసి, భోజనం చేద్దురు.''

తండ్రిని పరిచయం చేశాడు జనార్థన్. ఆయన పది నిమిషాలు మాట్లాడి ఏదో తరుముకొస్తున్నట్లు వెళ్ళిపోయాడు. దగ్గరుండి భోజనం ఏర్పాట్లు చూశాడు జనార్థన్.

భోజనా లయ్యాక పందిట్లో కూర్చున్నారు నలుగురూ. పట్నంలో కుర్రాళ్ళని అంటూ కొంచెం గౌరవం ప్రకటిస్తూ చూశారు ముగ్గుర్నీ. అది చాలా గొప్పగా అనిపించింది వాళ్ళ ముగ్గురికీ.

''మీ కా తూర్పు వైపు గది ఇచ్చాం. అందులో మీరు నిద్రపోండి, పేకపొండి, గంతులెయ్యండి అదంతా మీ ఇష్టం ... మందు తప్ప'' చివరి మాట మెల్లగా చెప్పాడు జనార్థన్.

''ఓ. కె. అన్నాడు రఘురాం.

''రేపు సత్యన్నారాయణ వ్రతానికి ఏర్పాట్లు చూడాలి. వస్తా'' వెళ్ళిపోయాడు జనార్థన్. అతను చూపించిన గదిలోకి వెళ్ళారు. పెద పెద్ద నవారు మంచాలూ సీలింగు ఫానూ ... ఉన్నా యాగదిలో... ముగ్గురికీ నిద్ర పట్టింది వెంటనే. కానీ రఘురాం లేచి పందిట్లోకి వెళ్ళిపోయాడు ఓ అరగంట తర్వాత.

చీకటి పడింది. కేశవరావు, రమేషూ లేచి బైటి కొచ్చారు. అక్కడ రఘురాం రెడ్డిగారి ఆడ చాకలితో మాట్లాడుతూ కనిపించాడు. కేశవరావు తిట్టు కున్నాడు. రమేష్ అసూయపడ్డాడు.

''ఇంకా కొంచెం సేపు నిద్ర పోకూడదూ! కొంపలు మునిగినట్టు లేచి రాకపోతే!'' చాకలి మనిషి వెళ్ళిపోయినందుకు బాధపడుతూ అన్నాడు రఘురాం.

''ఎక్కడి కొచ్చినా బుద్ధి మారదు'' అన్నాడు కేశవరావు. ఆ మాట విననట్టు గదిలోకి వెళ్ళి పోయాడు రఘురాం.

''అలా తిరిగొద్దామా?'' డ్రెస్ చేసుకున్నాక అడిగాడు రమేష్. వాళ్ళిద్దరూ తలూపారు. బయటి కెళదామనుకునే సరికి వచ్చాడు జనార్థన్.

''వూరు చూసొస్తారా!''

''అవును'' అన్నాడు కేశవరావు.

''ఒకేసారి భోజనం చేసి వెళితే మంచిది.''

''మధ్యాహ్నం తిన్నదే ఇంతవరకూ అరిగి చావలేదు. తరవాత చూద్దాం'' అన్నాడు రమేష్.

''మీ ఇష్టం. మీ రెప్పు డొచ్చినా రెడీగా ఉంచుతాను భోజనం. పెళ్ళి వారింటికి మాత్రం ఒంటి గంటకి బయలుదేరతాం. నిద్ర లేవకపోతే అటంబాంబు పెట్టయినా సరే లేపుతాను.''

''పగటి పూట పెళ్ళిళ్ళు చేసుకోవాలని చెపు తున్నాను కానీ, ఎవడూ వినలేదు ఇంతవరకు'' అన్నాడు రమేష్.

జనార్థన్ హడావిడిగా వెళ్ళిపోయాడు. కొద్ది సేపు పందిట్లో తిరిగారు. పెళ్ళి కొచ్చిన వాళ్ళ ప్రశ్నలకి ఓపికగా జవాబు లిచ్చారు.

''ఇహ బయలుదేరదామా బాటిల్ తీసుకుని'' అన్నాడు రమేష్.

రఘురాం నొచ్చుకున్నాడు ఆ విషయం మరిచి పోయినందుకు. ముగ్గురూ బయటికి వెళ్ళి జనార్థన్ వాళ్ళ పాలేరు చేత బాటిల్ ఉన్న చిన్న బాగ్ తెప్పిం చారు.

ఒక దుకాణంలో సిగరెట్లు కొని వూరంతా తిరిగారు. టూరింగ్ హాల్ దాకా వెళ్ళారు. దానికి ఎదురుగా రెండు గజా లెత్తు గోడలు లేచిన రెడ్డిగారి సిన్మా హాలు చూశారు. వెనక్కి మళ్ళారు.


అక్కణ్ణించి చెరువు కట్ట మీదికి చేరారు. చంద్రుడు మాసిన రేకులా ఉన్నాడు. వూరంతా నిద్ర పోయింది. ఆ టూరింగ్ టాకీస్ పరిసరాల్లో తప్ప.

చెరువు కట్ట మీద కూర్చున్నాక బాటిల్ తీశాడు రఘురాం.

''దోసిళ్ళతో తాగుతారా?'' అన్నాడు రమేష్,

''నిజమే గ్లాసు లెలా?'' అన్నాడు కేశవరావు.

''ఇంటి కెళ్ళిపట్టు కొద్దాం'' అన్నాడు రఘురాం.




''అర్ధ రాత్రి అంకమ్మ శివాలని. బాగ్ తెప్పించు కోవడానికి పాలేరే ఇబ్బడిగాం. ఇప్పు డెళ్ళి గ్లాసులంటే. బాబ్బాబూ మీ రింటి కెళ్ళండి, మీ రాకపోయినా పెళ్ళాం ఆగదు. మందూ గ్లాసులూ మేం సప్లయ్ చెయ్యలేమని జనార్థనం తండ్రి చెపుతాడు'' అన్నాడు రమేష్ అభినయిస్తూ.

''టూరింగ్ హాలువైపు వెళ్ళినా పోయేది. ఏ కిళ్ళీకొట్లోనో గ్లాసులు తెచ్చుకునేవాళ్ళం. ఒరే... అటు చూడండి. అక్కడేదో ఇల్లు న్నది వెళ్దాంపదండి'' అన్నాడు రఘురాం చేతితో చూపిస్తూ.

''ఇదేదో డ్రాక్యులా సినిమా సీన్లా ఉంది'' అన్నాడు రమేష్ లేచి నిలబడుతూ. ముగ్గురూ బయలుదేరారు. చేతిలో టార్చ్ లేదు. పుట్టి ల్డన్న, అంతమయింది వానొచ్చినట్టుంది. రోడ్డంతా బురదగా ఉంది. చంద్రుడు ఎప్పుడు మాయ మయ్యాడో తెలీదు. చీకట్లో చెరువునుంచి కప్పల రొద తప్ప నిశ్శబ్దంగా ఉంది అంతా. మెల్లిగా తడుముకుంటూ నడుస్తున్నారు. తాగుడు ఎన్ని త్యాగాలైనా చేయిస్తుంది.

వాళ్ళు ఇల్లనుకుంది ఇల్లు కాదు, కొంచెం పెద్ద గుడిసె. ముందు భాగాన నాలుగు గుంజలతో పందిరి ఉంది. ఆ పందిరికింద ఒకపక్కగా ఒక చెక్కబల్ల ఉంది. ఆ పందిట్లో మూడు మంచా లున్నాయి. ఆ గుడిసెనీ, పందిరినీ, పందిరికింద మనుషుల్నీ చీకటే దయాదు చేసిపెట్టింది. చెక్క బల్లకి పక్కనే ఓ నీళ్ళ తొట్టి ఉంది. ఆ గుడిసె పరిసరాల్ని సుత్తుకలు సూచిస్తున్నాయి.

ఆ చీకట్లో ఆ గుడిసె, ఆ గుడిసెలో మినుకు మినుకు మంటున్న దీపం. పక్కన కీచురాళ్ళ శబ్దం ఏదో వెలితిని, అసంతృప్తిని సృష్టించింది కేశవ రావు హృదయంలో.

''వీళ్ళని నిద్రలేపడ మెందుకు? పెళ్ళివారింటికే వెళ్దాం పదండి'' అన్నా డతను.

''అక్కడ బోరుకొట్టి చస్తాం. ఒక్కరోజుకే ఏమీ తోచడంలేదు. వీళ్ళిలా సంవత్సరాల తరబడి ఎలా ఉంటారో నా కర్థంకాదు'' అన్నాడు రమేష్. అతను హైస్కూలు చదువయ్యాక, మొత్తం వేళ్ళ్లోజులకంటె తన పల్లెటూర్లో గడపలేదు.

''ఇంత దూరం వొచ్చి వెనక్కి వెళ్ళడం బాగుండదు'' అన్నాడు రఘురాం.

వాళ్ళ మాటలకి ఒక మంచంలో కదలిక వచ్చింది.

''ఎవరారు?'' అంది వణుకుతున్న గొంతుతో.

''మేమే'' అన్నాడు రఘురాం చాలా ధీమాగా.

''ఎవరారంటే మాట్లాడరేం?'' అందిమంచంలో కూర్చుంటూ. చినిగిపోయిన దుప్పటిని పక్కన పడేసింది. రేగిపోయిన జుట్టు. రవిక లేదు. నల్ల చీర ఏ నాటిదో! ఒక చెంచాడు మాంసం, పావు లీటరు రక్తంతో అస్థిపంజరానికి చర్మం మేసి నట్టుంది ముసలమ్మ. దీపం వెలుగు నీడలు ఆమె మీద పడి చెరిగి పోతున్నాయి.

ఆమె పక్క మంచం మీద ఒక పిల్ల నిద్ర పోతూంది. ఎందుకనో మూలుగుతూ. ఆ పక్క

మున్న మంచంలో ఒక ముసలాడున్నాడు. ఆ మంచాల మీద పడుకున్న దానికీ, కింద పడుకున్న దానికీ ఏమీ భేదం లేదు.

"ఏ వూరు?" అంది చెయ్యి కళ్ళకు అడ్డం పెట్టుకుని.

"మాది పట్నం."

"దేని కొచ్చారిక్కడికి?"

"రెడ్డిగారింటికొచ్చాం" అన్నాడు రఘురావ్.

"ఆయనకేం దబురాజు. ఏం కావాలి మీకు?"

"మూడు గ్లాసు లివ్వు. మళ్ళీ ఇప్పుడే తెచ్చిస్తాం."

"తాగడానికా?" అంది ముసలమ్మ. "వూ" అన్నాడు రఘురావ్. వాళ్ళదీ, ఆమెదీ ఒకే ఉద్దేశమని తర్వాత వాళ్ళకి తెలిసింది.

"గ్లాసులా? గ్లాసులు కొండానికి డబ్బులేవీ? లేకపోయినా, ఏదో అట్టాగే ఈడ్చుకొస్తున్నా. డబ్బులేదంటే పెద్దాళ్ళకి కోపం. మరి పొటలు ఎట్టా జరగాల? చిన్న రైతని లేదు, పెద రైతని లేదు. అందరూ కావాలే. ఇంకో పని సేత కాదాయె మాకు! ఇప్పటికి చిన్న ఎంకట్రావయ్య గారింటి కెళ్ళి డబ్బడిగితే, వడ్లు కొలుస్తా నన్నాడు. ఇయ్యాల వూళ్ళోనే లేడు.... అయినా మేం ఒకళ్ళమే ఇన్ని పెళ్ళిళ్ళించి బతుకొస్తుంది. ఆ దొరకు సెంద్రమ్మ పెట్టింది పొటలు. దానికేం మారాణి. బుచ్చినాయుడు సపోటుంది దానికి. అత్తరవాత ఈ ముదనష్ట వూళ్ళో ఎందుకన్నెప్పి పట్నం వెళ్ళిపోయింది. బుచ్చినాయుడు కూడా ఆడికే చేరాడు కాపీలకోసం, మీసీరాకోసం ..."

మంచంలోంచి లేచి దీపం పెద్దది చేసి, గ్లాసులు వెతికి కడుగుతున్నంతసేపూ చెప్పింది.


"రెడ్డిగారింట్లో పెళ్ళి కదూ?"

"అవును" అన్నాడు కేశవరావు.

గ్లాసు లింకా ఆమె చేతిలోనే ఉన్నాయి.

"ఆయన మంచోడే. మొన్న తుఫానొచ్చిన వారంరోజులూ ఆయింట్లోనే ఉన్నాం. అల్లుడ్నాయి తంట పెళ్ళి. ఆయనకేం ఎన్ని పెళ్ళిళ్ళయినా చేస్తాడు. మేమూ చేశాను పెళ్ళి పంబరం. ఏం వచ్చి పచ్చింది. ఈ పిల్ల పుట్టటం తప్ప. దీని కి వారం రోజులనించి జొరం. మందేసుద్దా మనుకుంటే రూపాయిచూస్తే మేము చచ్చినంత ఒట్టు. మా ముసలాడు కదల్లేడు. యాపలం తగ్గిపోయింది. ఇదొరకటి మనుషులూ, రోజులూ కావు. ఈ పిల్ల అయ్య ... అణ్ణెప్పుడు తలుసుకుంటేనే పాపం ... నా కూతురు సుకంగా ఉంటదని ఆడికిచ్చి పెళ్ళిచేశా. ఆడు రిచ్చా తోలాడు. అదేంది? ...ఆటంట ... ఆ ... బ్రాకెట్టు ... అదని ఆడేవోడు. అది కెందుకు సెప్పండి. సదువు కున్నోరు మీరు. ఆట ఆడీ ఆడీ సగం నాసనమై పోయాడు. మిగతా సగం ఆడి ముండ నాసెనం చేసింది. ఆడదాని కష్టాలు మీ కర్థంకావు. నా కూతురు మంచమెక్కింది. ఆ డొంది తేసిన నాటికి ఈ పిల్ల కడుపులో ఉంది. ఈ పిల్ల ముండని కని సచ్చిపోయింది."

గ్లాసులు అలాగే పట్టుకుని మంచంలో కూర్చొని కళ్ళు తుడుచుకుంది. ఆ చీకట్లో, ఆ గుడిసె పందు




ముసలమ్మ చెబుతున్న కథ ఆకాశంలోంచి ఏదో విషాద మేఘాన్ని భూమ్మీదికి దించుతున్నట్టు అనిపించింది కేశవరావుకి.

"... ఇదిట్టాగే గాలితిని పెరిగింది. మాకే లేదు. దానికేం పెట్టం? సదువా? వల్లకాడా? ఏమీ లేదు ఈ పిల్లకి. కాణి సేతులో లేకపోయినా పర్వాలేదు. జొరాలూ, రొమ్ములూ రాకపోతే సరి. దాని కదే వచ్చిందిప్పుడు. ఏంచేస్తాం చెప్పండి. దేవుడిమీద బారం వేసి ఈడుస్తున్నాం బతుకుల్ని. ఇరుగుపొరుగోళ్ళు దీన్నిచేత లంకణాలు చేయిస్తున్నారు. నాకు నవ్వొచ్చింది. రోజూ లంకణాలె గదా? ఏదో నా సొది ఎళ్ళబోసుకున్నట్టుంది. గలాసులు మళ్ళీ తెచ్చివ్వండి."

గ్లాసు లందించి పడుకుంది ముసలమ్మ. తాగాలనే మూడ్ పోతున్నట్టనిపించింది కేశవరావుకి.

గ్లాసులతో మళ్ళీ చెరువు కట్టకి బైల్దేరారు ముగ్గురూ. కేశవరావు మౌనంగా ఉన్నాడు. కొన్ని భ్రమలు లేకపోతే మనిషి ఆనందించ లే డనుకుంటాను. టవున్లో అతని కివేవీ గుర్తుకు రావు.

"ఏరా డల్‌గా ఉన్నావు?" అడిగాడు రఘురావ్.

"ఆ ముసలమ్మ గురించి ఆలోచిస్తున్నాను" అన్నాడు కేశవరావు.

"నీ మొహం ఆలోచన. ఏమిటి నీ వెధవ ఆలోచనకి ఉపయోగం?"

"ఉపయోగం లేదేమో కానీ నష్టం మాత్రం ఉంది."

వాళ్ళిద్దరూ వాదించలేదు.

చెరువుకట్ట మీద కూర్చున్నారు ముగ్గురూ. కేశవరావు తక్కువ తాగాడు. అది సెంటిమెంటా? అతనికే ఆశ్చర్యంగా ఉంది. బాటిల్ మాత్రం ఖాళీ అయింది. వాళ్ళిద్దరూ కొంచెం ఎక్కువ పుచ్చుకున్నారు.

"ఐ వాంట్ సమ్మోర్ ..." అన్నాడు రఘురావ్.

"ఇంకొంచెం కావాలి ... అన్నాడు రమేష్ వంత పాడుతున్నట్టు.

"ఇక చాలు వెళ్దాం పదండి. ఇక్కడ మందు దొరకదు. అభ్యుదయం ఈ వూరి పొలిమేర దాకా వచ్చి ఆగిపోయింది" అన్నాడు కేశవరావు.

"ఆకలి వేస్తోంది" రమేష్ అన్నాడు.

"ఇప్పుడా రెండూ నెరవేరవు. కాబట్టి పెళ్ళివారింటి కెళ్ళటమే ఉత్తమమైన మార్గం."

"ఐ విల్ టాకిల్ అవర్ ప్రాబ్లమ్స్" అరిచాడు రఘురావ్ లేస్తూ. అతను తాగాక ఇంగ్లీషు ఫ్లూయెంట్‌గా మాట్లాడుతాడు.

గ్లాసులతో మళ్ళీ ప్రస్థానం ప్రారంభమైంది.

మళ్ళీ ముసలమ్మ దగ్గరకే. ఆమె ఇంకా నిద్రపోనట్టుంది. మంచంలో కదులుతోంది. రఘురావ్ గ్లాసు లదించాడు. ముసలమ్మ గ్లాసుల్ని అతి జాగ్రత్తగా మంచం కింద పెట్టుకుంది.

"ఇక్కడేం దొరకదా?" అడిగాడు రఘురాం.

"ఇక్కడేం దొరుకుద్ది. పదపొండు గంటలైనట్టుంది" అంది ముసలమ్మ. దీపం వెలుతుర్లో వాచీ చూసి పదకొండు దాటినా "పదికూడా కాలేదు" అన్నాడు రమేష్.

"ఇక్కడ బ్రాందీ దొరక దనుకుంటాను" అన్నాడు రమేష్ స్వగతంగా. కేశవరావు విసుగ్గా చూశాడు, మిత్రుల వైపు.

"బ్రాందీలా పాడా? అది దొరక్కనే బుచ్చినాయుడు పట్నం పోయాడు సెంద్రమ్మతో. నాటుసారా తప్ప ఏవీ దొరకదు" అంది ముసలమ్మ.

"ఏదైతే నేంలే" అన్నాడు రఘురావ్.

"సారా తాగుతారట్రా?" అన్నాడు కేశవరావు మొహం చిట్లిస్తూ. అదే రూములోనో, చెరువు కట్టమీదో అయితే రఘురావ్ పెద్ద ఉపన్యాసం ఇచ్చేవాడు కానీ, ప్రస్తుతానికి తిట్టాడు.

"షటప్ యువర్ బ్లడీమవుత్ ఫర్ ఎ వైల్" అని.

"ఆ సారాకూడా ఇప్పుడు దొరకదు. లత్తమ్మ సామాన్యురాలు కాదు. దాందే సారా కొట్టు. ఇప్పుడు దాన్ని లేపితే నానా బూతులూ తిడుతుంది. తూర్పేవు సుబ్బయ్య దానికి అలవాటు. ఆ ళ్ళిద్దరూ కలుసుకు పడుకుంటే మద్దె వచ్చినా లేపరు, బూకంపమైనా బయపడుద్ది."

ముసలమ్మ నడిగితే వీటు మీరికి అలవాటో లిస్టు చెబుతుందనుకున్నాడు కేశవరావు.

"నువ్వే పోకూడదూ?" అన్నాడు రమేష్. అతను ఏమాత్రైనా అవలీలగా అనేస్తాడు మందులో లేకపోయినా.

"నేనా? ఇక నరేలే. వల్లకాటికి తప్ప కదల్లేను." తేల్చేసింది ముసలమ్మ.

"అక్కడి కెళ్ళి ఏ పిలేరన్నా దొరుకుతాడేమో చూదాం" అన్నాడు కేశవరావు. అంత చీకట్లోనూ వాళ్ళిద్దరూ మింగుతా మన్నట్టు చూశారు కేశవరావు వైపు.

"అది మంచి పని" అంది ముసలమ్మ నిట్టూర్పుస్తూ.

"పెళ్ళి గొడవలో ఎవడు దొరుకుతాడు. నువ్వేం వూరికే చెయ్యి నక్కర లేదు. కావాలంటే ఒక పది రూపాయలు తీసుకో" అన్నాడు రఘురావ్.

చివరి మాట పేలింది. రమేష్ నవ్వుతూ చూస్తున్నాడు.

"ఎలాగూ పిల్లకి జబ్బున్నాదు కనక అక్కరకొస్తుంది" అన్నాడు తనే.

"తినడానికి ఏ మన్నా ఉన్నాయా?" అడిగాడు రఘురావ్.

"ఏవున్నయ్. నే నున్నాను. నిన్నెప్పుడో చేసిన పకోడీ లున్నయ్. పెళ్ళింటి కొచ్చి నిన్నటి పకోడీలు అడిగిన వాళ్ళని మిమ్మల్నే చూశా." గుడిసెలో కెళ్ళింది ముసలమ్మ. కొన్ని ధ్వనులు వినిపించాయి. కాగితం పొట్లంతో బయటి కొచ్చింది.

నిజం చెప్పడాని క్కూడా ధైర్య ముండాలి నిన్నటి పకోడీలని.

రఘురామ్ కిచ్చింది. మంచంలో కూర్చుని అక్కు చుట్టుకుంది.

"పది రూపాయలు తిస్తే వన్నారు కానీ, మేము ఇవ్వనే. అదే చిక్కు" అంది.

"ఆ ముసలాణ్ణి లేపు."

"ఎలా? ఆ దెబ్బలు కదలేడు. నేనే నయం. అదీగాక అడు మరీ డబ్బు కక్కుర్తి మనిషి. పదికి ఇరవై అడుగుతాడు."

ముసలమ్మ అవకాశాన్ని అనువుగా మార్చుకుంటున్నదని గ్రహించాడు రమేష్.

"ఇరవై ముప్పై తీసుకోగానే సరికాదు. రేపు రెడ్డిగారికి తెలిస్తే బాగుండదు. నా ఇంటి కొచ్చిన వాళ్ళ దగ్గర లాగేస్తారా? అని పది మంది ముందూ నిలదీస్తాడు."

"మీరేగా ఇస్తానంది?"

"మేం పది రూపాయలే ఇస్తామన్నాం."

ముసలమ్మ లేచి వెళ్ళి ముసలాణ్ణి లేపింది. అతను ఆమె కంటె ఎందులోనూ మెరుగ్గా లేడు. ఒక్క గడ్డం, లోపలి తప్ప.

"పది రూపాయలు ఇస్తారంట. సారా తెస్తావా?"

"ఇవ్వు డెవడు పోతాడే? కావాలిస్తే మువ్వెళ్ళు. నే నసలు నడిచ్చావలేను."

"పది రూపాయలు చేదా ఏంది? పిల్లని అట్టా చూస్తూ కూడా."

"ఇదేం గొడవే అర్ధరాత్రి పూట. అవ లా తెమ్మనే వాళ్ళెవరా?"

"రెడ్డిగారింటికి పెళ్ళి కొచ్చారంట."

"ఆయన గారింటికా?"

ముసలాడు లేచాడు. కర్ర వెతుకుతున్నాడు. ముసలమ్మ ఈ లోపల ఒక సీసా, ఒక తాడుముక్క తెచ్చింది. సీసాకి తాడు కట్టి ముసలాడి చేతికి తగిలించింది. రమేష్ రెండు పదులు తీసిచ్చాడు. ఒక పది ముసలమ్మ తీసుకుంది. ముసలాడు కర్ర పోటుతో బయలుదేరాడు.

అతను దారిలో పడిపోక పోతేనే ఆశ్చర్యం. ఇంటికి క్షేమంగా వస్తే మరీఆశ్చర్యం. బీదరికానికి కీ ఇచ్చినట్టు దరిద్రం దేశం మీదికి తరలి వెళుతున్నట్లు ఫీలయ్యాడు కేశవరావు వెళుతున్న ముసలాణ్ణి చూస్తూ.

వాళ్ళిద్దర్నీ అంత బాధ పెట్టి తాక్కపోతే నేం? ముసలమ్మ ఆశ మరీ భయంకరంగా తోచింది. అంత రాత్రి వేళ మొగుణ్ణి లేపి పంపింది పది రూపాయల కోసం. కేశవరావు అసహ్యంగా తల విదిలించాడు.

కానీ అంతకంటె భయంకరమైన నిజం మరొకటి చెప్పింది ముసలమ్మ.

"ఆడింటి కొస్తాడో, రాడో. అసలే రేచీకటి మా లోకం. ఏ గోతిలోనో, గుంటలోనో పడితే తెల్లారి మళ్ళీ" అంది ముసలమ్మ వ్యంగ్యంగా.

ముసలమ్మది అవసరం. పిల్లకి బాగు చెయ్యొచ్చు. రేపు బియ్యం కొనుక్కో వచ్చు. దరిద్రం సృష్టించే లక్ష సమస్యల్లో ఒక పూట సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు పది రూపాయలతో.

ముసలమ్మది తప్పులేదు, ముసలాడిది తప్పు లేదు. వాళ్ళ అవసరానిదీ, దరిద్రానిదే తప్పు. ఎంత అవసరమైనా ఆ కక్కుర్తి రోతగా అనిపించింది కేశవరావుకి.

తాము ముగ్గురూ మాత్రం రాక్షసులనిపించింది అతనికి. ఎదుటివాడి బలహీనతను అవసరంలో ముడిపెట్టి, తాపుదెబ్బ తీయటం రాక్షసుల పనే మాటికి మాటపిత్యా.

ఆ మాటే రఘురామ్‌తో అన్నా డతను తర్వాత.

"డబ్బు వాళ్ళ అవసరం. మందు మన అవసరం. ఇచ్చేశాం. సారా తెప్పించాం. వెధవది దీనిగురించి బుర్ర బద్దలు కొట్టుకోవడమెందుకో నా కర్థం కాదు" అన్నా డతను.

"ఎదుటివాడి అవసరానికి సాయం చెయ్యాలి. దానితో ఆడుకోవడం కాదు."

"ఏదీ పూరికే నాకో ఐదు రూపాయలు ఇవ్వు చూస్తాను" అన్నాడు రఘురామ్ నవ్వుతూ.

"ఏదో ఇవ్వడనుకో. కానీ సానుభూతి చూపించాలేమో."

"సానుభూతి చూపిస్తే ముసలమ్మకి పది దక్కుతాయా?"

లాజిక్ బాగానే ఉంది కానీ, ఆ వాదనలో ఏదో లోపముందని తోచింది కేశవరావుకి. ఆ తర్వాత లోపమేమిటో కూడా అతనికి బోధపడింది.

అరగంట గడిచింది. ముసలాడు మెల్లిగా వచ్చి సారాసీసా అందించాడు ఉస్సురని మంచంలో కూలబడ్డాడు.

"ఆ దీపమిట్టా తీసుకురాయే!" ముసలమ్మ తెచ్చింది మూలుగుతూ.

"చూశావంటే ఎంత పెద్ద దెబ్బ తగిలిందో. పై తోలు లేచిపోయింది. పోయేటప్పుడు గుంట లోకి జారాను. ఆ గుడ్డముక్క ఇట్టా తడిపివ్వు."

"పర్వాలేదుగా. అదే చాలు. ఇక పడుకో. రేపొ డాక్టరికి చెప్పి పిల్లకి సూదిమందు ఏయించాలి దాంతోపాటే నీది కూడా" అంది ముసలమ్మ అతని దెబ్బను ఖాతరు చెయ్యకుండా.

కేశవరావుకి ముసలమ్మ మీద సానుభూతి పోయి, అసహ్యం వేసుకుంది. ముగ్గురూ మళ్ళీ బైల్దేరారు. ఆ ముసలాడి రక్తం, ఎముకలూ గుండకొట్టి ఆ సీసానింపినట్టు అనిపించింది కేశవరావుకి.

ఈసారి కేశవరావు తాగలేదు. అతని కసలు గాలనిపించలేదు. ఇందాకటి మత్తు కూడా పోయింది. వాళ్ళిద్దర్నీ ఆపి ఆ సీసా విసిరికొడదా మనుకున్నా డతను. కానీ అతని మాటలు వాళ్ళర్థం చేసుకోరు. అంత సెన్సిటివ్‌గా ఉండ కూడదని సలహా ఇస్తారు. కానీ రాబందేలి ఇతరుల్ని బాధ పెట్టి, లంచమిచ్చి, బుజ్జగించి, అదిరించి, ఆ సీసా తెప్పించి తాగడంకంటె ఈ సున్నితత్వం ఉండడమే ఎంతో ఉన్నతమనిపించింది అతనికి. అలా ఉన్నందుకు అతనా తర్వాత గర్వపడ్డాడుకూడాను.

వాళ్ళమధ్య ఎక్కువగా మాటలు సాగలేదు కొంచెం తాగాక వాళ్ళిద్దరూ తాగలేకపోయారు. సీసా అక్కడే వదిలేసి లేచి నిలబడ్డారు.

కేశవరావు ముందు నడుస్తున్నాడు.

"వాడెక్కడికి నీతిమంతుడూ, మనం తాగుబోతు వెధవలమైనట్టు పెద్ద పోజు" అన్నాడు రమేష్.

"వినేస్తున్నాను? తాగననే చెప్పాను" అన్నాడు కేశవరావు. రఘురామ్ మాట్లాడలేదు. అతన్ని కదిలిస్తే ఆఖరికి వైదాస్ కథన్నా ఇంగ్లీషులో వాగుతాడు. అందువల్ల మెదలా మాట్లాడకుండానే జనార్దన్ ఇంటికి వెళ్ళారు.

ఇంట్లో ఇద్దరు పిల్లలు తప్ప అంతా ఖాళీగా ఉంది. సగం చుట్టిన చాపలూ, దుప్పట్లూ విడిచేసిన బట్టలూ, పెట్టెలూ, ఒకమూల పేక ముక్కలూ..చెల్లా చెదురుగా పడున్నాయి.

పెళ్ళివారింటికి బైల్దేరారు ముగ్గురూ.

జనార్దన్, పెళ్ళికూతురూ వేదికమీద కూర్చొన్నున్నారు. వేదిక ఎదురుగా కుర్చీలున్నాయి. వెనక వరుసలో కూర్చున్నారు ముగ్గురూ. కేశవరావు చాలా ఉత్సాహంగా పెళ్ళితంతు చూస్తున్నాడు. ఆడవాళ్ళు లేకపోతే ఈలోకం ఇంత అందంగా ఉండేదికాదని ఆ చీరెలూ, రెపరెపలూ, సెంట్లూ, పూలూ, నవ్వులూ, పరాచికాలూ చూసి నిర్ధారించుకున్నా డతను.

అతని ముందో భారీ మనిషి కూర్చున్నాడు. ఆ భారీమనిషి పక్కనే ఒక ముసలాయన. ఆయనే ట్రాక్టర్లో రఘురామ్‌ని అన్యాయం చేశాడు. ఇద్దరూ లో గొంతుకతో మాట్లాడుకుంటున్నారు. ముసలాయనే అంటున్నాడు.

"రెడ్డిగారు ఇదివరకో సమ్మంధం చూశారు. కట్నం తక్కువని అది మానేసి ఇది చూశారు. అయితే ఆ పిల్లే జనార్దనానికి నచ్చిందట. పిన్నాపోలు రెండు గజాలెత్తు లేచింది, పని ఆగి పోయింది. డబ్బుకోసమని ఈ సమ్మంధం కుదుర్చుకున్నాడు. కొడుకంటే ప్రేమేకానీ....డబ్బు మరొకటా?

"కట్నం బాగా లాగాడా?" అడిగాడు భారీ మనిషి.

"ఒక లక్ష, స్కూటర్, ఏదో వచ్చేదటా."

"డబ్బు కక్కుర్తి కాకపోతే కొడుక్కి నచ్చిన పిల్లనే ఇచ్చి పెళ్ళి చెయ్యకూడదటూ?"

"చెయ్యొచ్చనుకో. కానీ ఇంత డబ్బు వాళ్ళివ్వ లేమన్నారట."

"ఈ కట్నంతో పిన్నాపోలూ, మరో నాలుగెకరాలూ అన్నమాట."

కేశవరావు తర్వాత మాటల్ని వినలేదు. అప్పుడే అతనికి తెలిసిపోయింది. ముసలమ్మ ముసలాణ్ణి ఎందుకు లేపిందో, అతనెందుకు లేచికట్టైనా అంతరాత్రివేళ సారాకోసం వెళ్ళాడో ఎందుకు కాలికి దెబ్బతగిలినా అతను గానీ, ఆమెగానీ బాధ పడలేదో అతనికర్థం అయింది.

రెడ్డిగారిదీ అవసరమే, దాన్ని మెచ్చుకుంటాం ముసలమ్మదీ అవసరమే, దీన్ని అసహ్యించుకుంటాం.

ఒకటి పిన్నాపోలు కోసమైతే, మరొకటి సూదిమందుకోసం.

ఒకటి నాలుగెకరాలకోసమైతే, మరొకటి గంజినీళ్ళకోసం.

ముసలమ్మని అసహ్యించుకోవడం తన లోపమని కేశవరావు పెద గా నవ్వాడు. రమేష్, రఘురామ్ ఉలిక్కిపడి అతనివైపు చూశారు.

ముందు వరుసలోని భారీమనిషి, ముసలాయన కూడా వెనక్కి తిరిగి చూశారు.

"డబ్బా! ఐ లవ్ యూ."

"డబ్బా! ఐ హేట్ యూ" అన్నాడు కేశవరావు ఏటో చూస్తూ. ★